క్లుప్తంగా

సీలింగ్ భూములకు పట్టాలు మంజూరు చేయాలి



పరిపాలనాధికారి సుజాతకు వినతిపత్రం అందజేస్తున్న ఏపీఆర్‌సీఎస్ నేతలు

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): తమ సాగులో 20 ఏళ్లగా ఉన్న సీలింగ్ భూములకు పట్టాలు మంజూరు చేయాలని గోకవరం మండలం శివరామపట్నం పేదలు ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆర్‌డీవో కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం ఏపీఆర్‌సీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల ఆంజనేయులు తదితరులు ఆర్‌డీవో కార్యాలయ పరిపాలనాధికారి సుజాతకు వినతి పత్రం అందజేశారు. కాగా.. ఆర్‌డీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్‌ఎస్–మీకోసం కార్యక్రమానికి ఐదు అర్జీలు వచ్చాయని ఆర్‌డీవో కార్యాలయ పరిపాలనాధికారి సుజాత తెలిపారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్ ప్రారంభం



ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్‌లో జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను అధికారులు వినియోగించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు అన్నారు. బొమ్మూరు కలెక్టరేట్ ఆవరణలో సోమవారం రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో నేచురల్ ఫార్మింగ్ వీక్లీ స్టాల్‌ను ఆయన ప్రారంభించారు. ప్రకృతి వ్యవసాయం విభాగం ద్వారా ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల వీక్లీ మార్కెటింగ్‌లో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాధవరావు మాట్లాడుతూ ఈ స్టాల్‌లో ప్రతి సోమవారం రసాయన ఎరువులు వాడని కూరగాయలు, ఆకు కూరలు, బియ్యం, పసుపు, కారం, బెల్లం మొదలగునవి విక్రయిస్తారు. కార్యక్రమంలో జిల్లా అదనపు డీపీఎం మహబూబ్ వలీ, జిల్లా ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్ వరలక్ష్మి, ఎస్ఎఫ్ఏ గౌతమ్, వీక్లీ స్టాల్ ఎంటర్ ప్రెన్యూర్ నిరోషా, వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ వసతి గృహాల పరిశీలన



వసతి గృహంలో ఆహారాన్ని రుచి చూస్తున్న సీనియర్ సివిల్ జడ్జి శ్రీలక్ష్మి

కంబాలచెరువు: నగరంలోని సంక్షేమ వసతి గృహాలను సోమవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.శ్రీలక్ష్మి సందర్శించారు. స్థానిక వుమెన్స్ కళాశాల సమీపంలోని ఎస్సీ సంక్షేమ బాలుర వసతి గృహం, ఎస్టీ సంక్షేమ బాలికల వసతి గృహం, గవర్నమెంట్ వర్కింగ్ ఉమెన్స్ వసతి గృహాలకు వెళ్లి, అక్కడి వసతులు, ఆహారాన్ని పరిశీలించారు. వసతి గృహాల సిబ్బందితో మాట్లాడుతూ విద్యార్థులకు సురక్షిత తాగునీరు, మంచి ఆహారం అందించాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, వసతి గృహాల ప్రాంగణంలో అవసరమైన మరమ్మతులను ఎప్పటికప్పుడు చేయించాలన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అందిస్తున్న సేవలను వారికి వివరించారు. వసతి గృహంలో ఎటువంటి సమస్యలున్నా, ఎటువంటి న్యాయ సహాయం కావాలన్నా జిల్లా న్యాయసేవాధికార సంస్థకు తెలియజేయాలన్నారు.

నిబంధనల మేరకు అర్జీల పరిష్కారం



అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ కేతన్ గార్గ్

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): నగరపాలకసంస్థ పరిధిలో ప్రజల నుంచి స్వీకరించిన ప్రతి అర్జీని నిబంధనల మేరకు పరిష్కరిస్తున్నట్టు నగరపాలకసంస్థ కమిషనర్ కేతన్ గార్గ్ అన్నారు. సోమవారం నగరపాలకసంస్థ కార్యాలయంలో అధికారులతో కలిసి ప్రజల నుంచి 22 అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకట రమణ, నగరపాలక సంస్థ హెల్త్ ఆఫీసర్ వి.వినూత్న, ఎస్ఈ ఎంసీహెచ్ కోటేశ్వరరావు, సిటీ ప్లానర్ జి.కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

నిరీక్షణకు తెరపడేనా..

- కొత్త రేషన్ కార్డులకు మోక్షమెప్పుడు?
- ఆశగా ఎదురు చూస్తున్న అర్హులు
- తొమ్మిది నెలలైనా ఆ ఊసే ఎత్తని కూటమి ప్రభుత్వం



రేషన్ కార్డులు

రాజమహేంద్రవరం రూరల్: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి తొమ్మిది నెలల పూర్తి కావస్తున్నా కొత్త రేషన్ కార్డులకు సంబంధించి తగిన ఆదేశాలు ఇవ్వకపోవడంతో తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. రాజమహేంద్రవరం సిటీ, రూరల్ నియోజక వర్గాల్లో వందల మంది అర్హులు కొత్త రేషన్ కార్డుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం దీనిపై అసలు ఆలోచన చేస్తున్నట్లు లేదు. రేషన్ కార్డుల కోసం అర్హులైన వారు సచివాలయాలు చుట్టూ తిరుగుతున్నారు. ప్రభుత్వం నుంచి ఎటువంటి మార్గదర్శకాలు రాకుండా ఏమీ చేయలేమని సచివాలయ సిబ్బంది చేతులెత్తేస్తున్నారు. దీంతో అక్కడికి వెళ్లిన ప్రజలకు నిరాశగా తిరిగి రావాల్సిన పరిస్థితి ఏర్పడింది. కార్డుల్లో మార్పులు, చేర్పులకు కూడా అవకాశం ఉండటం లేదు.

వైఎస్సార్ సీపీ హయాంలో ఇంటి వద్దకే సేవలు

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రేషన్ కార్డుల మంజూరు పారదర్శకంగా జరిగేది. అర్హులైన ప్రజలు సచివాలయానికి వెళ్లి దరఖాస్తు చేసుకుంటే వెంటనే కార్డులు మంజూరయ్యేవి. కార్డుల్లో కొత్తగా సభ్యులను చేర్చుకోవాలన్నా, తొలగించాలన్నా సచివాలయ పనిదినాల్లో ప్రభుత్వ సైట్లు ఎప్పుడూ అందుబాటులోనే ఉండేవి. వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి వారే స్వయంగా దరఖాస్తు చేసి, కార్డు మంజూరైతే ఇంటికి తీసుకొచ్చి లబ్ధిదారులకు అందజేసేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. సార్వత్రిక ఎన్నికల షెడ్యూలు చేసినప్పటి నుంచి సైట్లన్నీ మూసేశారు. దీంతో ఇదేం పాలన అని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

హామీలతో సరిపెట్టారు

అధికారం కోసం ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చిన కూటమి నాయకులు అధికారంలోకి వచ్చాక మాత్రం వాటిని పట్టించుకోవడం లేదు. వివిధ సంక్షేమ పథకాలకు రేషన్ కార్డులే ఆధారం. కార్డుల మంజూరు చేయడంలో కూటమి ప్రభుత్వం ఇంత జాప్యం చేయడంతో ప్రజలు మండి పడుతున్నారు.

మంజూరు చేయాలి



వార్డు సచివాలయాల్లో రేషన్ కార్డుల కోసం అడుగుతుంటే ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆదేశాలు రాలేదని చెబుతున్నారు. కనీసం మార్పులు, చేర్పులు, డిలీషన్స్‌కు అవకాశం ఇచ్చినా బాగుండేది. రేషన్ కార్డు లేకపోవడంతో ప్రభుత్వ పథకాలు అందవని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలి.

– చోడవరపు అమూల్య, ఇన్నీసుపేట, రాజమహేంద్రవరం

ఎదురుచూపులు



గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో దరఖాస్తు చేసుకోగానే రేషన్ కార్డు కోసం వచ్చేది. వలంటీర్లు ఇంటింటికి వచ్చి కార్డుల కోసం దరఖాస్తు చేయించేవారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో రేషన్ కార్డు మంజూరు కోసం ఎటువంటి మార్గనిర్దేశకాలు ఇవ్వలేదు. వందల మంది కొత్త రేషన్‌కార్డుల కోసం, మార్పులు, చేర్పుల కోసం ఎదురు చూస్తున్నారు.

– బత్తిన అప్పారావు, వైఎస్సార్ సీపీ మండల గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు, శాటిలైట్ సిటీ

భూకబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి



కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న ఏపీ రైతు కూలీ సంఘం జిల్లా కమిటీ సభ్యులు

రాజమహేంద్రవరం రూరల్: ప్రభుత్వం తమకు కేటాయించిన ఇళ్ల స్థలాలను కబ్జా చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం బొమ్మూరులోని కలెక్టరేట్ వద్ద ఆందోళన నిర్వహించింది. అనంతరం పీజీఆర్‌ఎస్‌లో కలెక్టర్ పి.ప్రశాంతికి వినతి పత్రం అందజేసింది. ఈ ఆందోళనకు జనసేన మండల ఉపాధ్యక్షుడు గంగాధర్, బీసీ సంఘం అధ్యక్షులు అనుసూరి అరుణ్ కుమార్ సంఘీభావం తెలిపారు. ఏపీఆర్‌సీఎస్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వల్లూరి రాజబాబు మాట్లాడుతూ రంగంపేట మండలం ఈలకొలను గ్రామంలో ప్రభుత్వం దళిత ఇతర పేదలకు సర్వే నంబరు 12లో ఇళ్ల స్థలాలు కేటాయించారన్నారు. సుమారు 15 మందికి ఇచ్చిన ఇళ్ల స్థలాలను కురుకూరి శ్రీను, కురుకూరు దుర్గాప్రసాద్, కురుకురు శ్రీనివాస్ అధికార పార్టీ అండదండలతో అధికారులను మేనేజ్ చేసుకుని ఆక్రమించుకున్నారన్నారు. ఆ స్థలాలలో మట్టితో మేరక చేయించి, చుట్టూ కంచె వేసి కబ్జా చేశారన్నారు. గత నెల 24వ తేదీన బాధితులు ధర్నాకు ఉపక్రమించగా, సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చి నేటికీ అధికారులు సమస్య పరిష్కరించలేదన్నారు. ఆందోళనలో జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రమేష్, నాయకులు రామలింగేశ్వరరావు, ఎల్లే సత్తిబాబు, పీడీఎస్‌యూ(వి) రాష్ట్ర నాయకులు కడితే సతీష్, జిల్లా కార్యదర్శి శ్రీకాంత్, పారిశుద్ధ్య కార్మికుల సమైక్య కన్వీనర్ బొత్స ఏసు తదితరులు పాల్గొన్నారు.

హామీలను విస్మరించిన కూటమి ప్రభుత్వం

- బడ్జెట్లో యువతకు మొండి చేయి
- ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై నిర్లక్ష్యం
- 12న వైఎస్సార్ సీపీ యువత పోరు
- పోస్టర్ ఆవిష్కరించిన మాజీ ఎంపీ భరత్ రామ్



వైఎస్సార్ సీపీ యువత పోరు పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాజీ ఎంపీ భరత్ రామ్ తదితరులు

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): నిరుద్యోగ భృతి, 20 లక్షల ఉద్యోగాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇస్తామన్న కూటమి ప్రభుత్వం.. ఆ విషయాలను పూర్తిగా విస్మరించిందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్ ధ్వజమెత్తారు. ఆయన సోమవారం పార్టీ సిటీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఈ పథకాల అమలుకు రూ.1,300 కోట్లు కేటాయించాల్సి ఉన్నప్పటికీ ఒక్క రూపాయి కూడా బడ్జెట్‌లో కేటాయించలేదన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో పోరాటం జరుపుతామన్నారు. దీనిలో భాగంగా ఈ నెల 12వ తేదీన యువత పోరు పేరిట కలెక్టర్ కార్యాలయాల వద్ద ఆందోళన నిర్వహిస్తామన్నారు. ఈ ఆందోళనకు యువత, విద్యార్థులు పెద్ద ఎత్తున తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. గొప్పగా చెప్పిన 20 లక్షల ఉద్యోగాలు ఎక్కడికి పోయాయని ప్రశ్నించారు. దావోస్‌లో ఒక్క ఎంఓయూ కూడా ఎందుకు చేసుకోలేకపోయారని నిలదీశారు.

హామీల అమలు ఎక్కడ!

మాజీ ఎంపీ భరత్ రామ్ మాట్లాడుతూ కూటమి నాయకులు ఎన్నికల సమయంలో ఇష్టం వచ్చినట్లు హామీలను గుప్పించి, అధికారంలోకి వచ్చాక అమలు చేయకపోవడం దారుణమన్నారు. చంద్రబాబు ఇచ్చిన మేనిఫెస్టోను అమలు చేయించాల్సిన బాధ్యత కూటమిలో భాగం పంచుకున్న బీజేపీపై ఉందా, లేదా అని ప్రశ్నించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పోలవరం ఎత్తు తగ్గిస్తున్నారంటూ ఈనాడు పేపర్లో చంద్రబాబు గగ్గోలు పెట్టారని, మరి ఇప్పుడు పోలవరం ఎత్తుపై మాట్లాడగలరా అన్నారు. పూర్తి స్థాయిలో ఎంపీలు ఉన్నా ప్రత్యేక హోదా గురించి ఎందుకు అడగడం లేదని, విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు క్యాప్టివ్ మైన్స్ ఎందుకు కోరడం లేదన్నారు. రాజమహేంద్రవరం ఈవీఎం ఎమ్మెల్యేకి ప్యారాచూట్ స్పెల్లింగ్ కూడా రాదని ఎద్దేవా చేశారు. ఇందుకు సంబంధించి ఎమ్మెల్యే పెట్టిన పోస్టును చూపించారు.

ఈ ప్రశ్నలకు బదులేది

భరత్ రామ్ మాట్లాడుతూ ఆదిరెడ్డి కుటుంబం 15 ఏళ్లగా అధికారంలో ఉందికదా, రాజమహేంద్రవరంలో ఒక్క అభివృద్ధి కార్యక్రమమైనా చేశారా అని ప్రశ్నించారు. గౌతమీ సూపర్ బజార్ స్థలానికి సంబంధించి ముడుపులు తీసుకున్నానని చేస్తున్న ఆరోపణలను నిరూపించాలని సవాల్ చేశారు. పందిరి మహాదేవుడు సత్రానికి సంబంధించిన స్థలాన్ని ఎందుకు అనధికారంగా ఉపయోగించుకుంటున్నారని ప్రశ్నించారు. కోటిలింగాల ఘాట్‌లో ఎమ్మెల్యే అనుచరులు గోదావరిని గుల్ల చేస్తున్నారన్నారు. బోట్‌మాన్ సొసైటీలు పనిచేసే చోట డ్రెడ్జింగ్ ఎలా చేస్తారని అడిగారు. సమావేశంలో మార్గాని నాగేశ్వరరావు, పోలు విజయలక్ష్మి, నక్కా శ్రీనగేష్, మార్తి లక్ష్మి, నరవ గోపాలకృష్ణ పాల్గొన్నారు.


ఇసుక సరఫరాలో ఆటంకాలు ఉండొద్దు



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ చిన్నరాముడు

రాజమహేంద్రవరం రూరల్: ఇసుక సరఫరా విధానంలో ఆటంకాలు లేకుండా చూడాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు అన్నారు. ఆయన చాంబర్‌లో సోమవారం సాయంత్రం జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఏజెన్సీలలో జవాబుదారీతనం, పారదర్శకతను పెంచడానికి, సరఫరా నిర్వహణను మెరుగు పరచడానికి తీసుకోవాల్సిన చర్యలను కమిటీ సభ్యులు వెంటనే సంబంధిత జిల్లా స్థాయి ఇసుక కమిటీల దృష్టికి తీసుకురావాలని కోరారు. ఏజెన్సీ 'ఫస్ట్ కమ్ ఫస్ట్ సర్వ్' ప్రాతిపదికన ప్రత్యేక నంబర్‌తో అన్ని వాహనాలకు ఇసుకను సరఫరా చేయాలన్నారు. ఇసుక రవాణాపై ఐవీఆర్‌ఎస్ ద్వారా ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించనున్నట్లు, వాటిలో వచ్చే ఫిర్యాదుల మేరకు క్షేత్ర స్థాయిలో తనిఖీలు నిర్వహించి వివరాలు నమోదు చేయాల్సి ఉందన్నారు. సమావేశంలో ఏడీ మైన్స్ డి.ఫణి భూషణ్ రెడ్డి, అడిషనల్ ఎస్పీ ఏవీ సుబ్బరాజు, ఆర్డీవోలు రాణి సుస్మిత, ఆర్.కృష్ణ నాయక్, డీపీవో వి. శాంతమణి, ఆర్టీవో ఆర్.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

గరిమెళ్లకు నఖచిత్ర నివాళి



పరసా రవి గీసిన బాలకృష్ణ ప్రసాద్ నఖచిత్రం

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): తిరుమల తిరుపతి దేవస్థానం ఆస్థాన విద్యాంసుడు గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ మృతి సంగీత ప్రపంచానికి తీరని లోటని నఖచిత్రకారుడు పరసా రవి అన్నారు. నఖచిత్రకారునిగా ఆయనతో పరిచయం తన అదృష్టమన్నారు. ఆయన సుమారు వెయ్యికి పైగా అన్నమాచార్య సంకీర్తనలకు స్వర కల్పన చేశారన్నారు.

ఆయన నఖ చిత్రాన్ని వేసి అందించడం తన భాగ్యమని, గతంలో కొంతమూరు వల్లభ గణపతి ఆలయ తృతీయ వార్షికోత్సవ సభలో ఆయనకు ఆ చిత్రాన్ని అందజేసినట్టు తెలిపారు. ఈ సందర్భంగా నఖచిత్రంతో ఆయనకు నివాళులర్పించారు.

భద్రతా ప్రమాణాలు కచ్చితంగా పాటించాలి

- ఏప్రిల్‌లో నీతి ఆయోగ్ బృందం రాక
- కలెక్టర్ పి ప్రశాంతి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం రూరల్: పరిశ్రమల నిర్వహణలో భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. గ్రోత్ హబ్ కింద జిల్లాలో ఏప్రిల్‌లో కేంద్ర బృందం సభ్యులు పర్యటించనున్నట్లు తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇండస్ట్రీస్ సేఫ్టీ కమిటీ, 16వ డీఐఈపీసీ కమిటీ సమావేశం సోమవారం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. తొలుత 15వ కమిటీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు, చర్య అనంతర నివేదికపై సమీక్షించారు. కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ పరిశ్రమల కోసం వచ్చిన దరఖాస్తులు ఎందుకు అనుమతుల జారీలో పెండింగ్ ఉందో, ప్రతి దరఖాస్తు వారీగా నివేదిక కమిటీ ముందు ఉంచాలన్నారు. సింగిల్ విండో విధానంలో అనుమతులు జారీ చేయాల్సి ఉందన్నారు. ప్రమాదకర వ్యర్థాలు విడుదల చేసే పరిశ్రమలు నెల, మూడు, ఆరు నెలలకు తప్పనిసరిగా తనిఖీలు నిర్వహించి, అందుకు అనుగుణంగా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఆయా పరిశ్రమలలో అలారింగ్, సెన్సార్ పరికరాలు కచ్చితంగా పనిచేసేలా చూడాలన్నారు.

జిల్లాకు రానున్న నీతిఆయోగ్ బృందం

విశాఖపట్నం, విజయ నగరం, అనకాపల్లి, తూర్పు గోదావరి జిల్లాలలో పరిశ్రమలు, తయారీ రంగం, సేవా రంగం కింద అందుబాటులో ఉన్న అవకాశాలు పరిశీలించేందుకు కేంద్ర ప్రభుత్వ నీతి ఆయోగ్ బృందం రానుందని కలెక్టర్ ప్రశాంతి తెలిపారు. మన జిల్లాలో నాలుగు రంగాలలో గ్రోత్ హబ్‌కు అవకాశాలను క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తుందన్నారు. నర్సరీ అనుబంధ పరిశ్రమ – ఆధారిత విలువ జోడించిన సేవలు, మైక్రో ప్లాంట్లు, అలంకార మొక్కలు, టైల్స్ పరిశ్రమ, ఆర్గానిక్ జీడిపప్పు, హెర్బల్ ఉత్పత్తులు, సేవారంగం (ఐటీ ఆధారిత) అవకాశాలపై అధ్యయనం చేసేందుకు ఏప్రిల్‌లో నీతి ఆయోగ్ బృందం పర్యటన ఉంటుందన్నారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల అధికారి వనిధర్ రామన్, పరిశ్రమ ఇన్‌స్పెక్టర్ డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆర్.తిరుమలరావు, పరిశ్రమల సహాయ సంచాలకులు ప్రదీప్ కుమార్ పాల్గొన్నారు.

శ్రామిక భవనాన్ని అన్ని హంగులతో తీర్చిదిద్దాలి

ప్రకాశం నగర్: నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న శ్రామిక భవనాన్ని త్వరలో అన్ని హంగులతో తీర్చిదిద్దాలని నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్ అధికారులను ఆదేశించారు. స్థానిక 49వ వార్డులోని క్వారీ మార్కెట్ జంక్షన్ సమీపంలోని డంపింగ్ యార్డు ఆవరణలో నిర్మిస్తున్న శ్రామిక భవనాన్ని సోమవారం సాయంత్రం ఆయన సందర్శించారు. సమావేశాలు, వర్కు షాపులు నిర్వహించుకొనేలా అన్ని ఏర్పాట్లతో ఈ భవనాన్ని నిర్మిస్తున్నామన్నారు. అనంతరం కుక్కల బర్త్ కంట్రోల్ ఆపరేషన్ థియేటర్‌ను సందర్శించారు. ప్రతి రోజు 30 కుక్కలకు ఆపరేషన్లు నిర్వహించేలా ఈ కేంద్రాన్ని తీర్చిదిద్దుతున్నామన్నారు. ఆయన వెంట ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మదర్షా ఆలీ, అసిస్టెంటు ఇంజనీర్ పి.ప్రసాద్ తదితరులు ఉన్నారు.

లక్ష్మీ గణపతి ఆలయంలో విగ్రహాల ప్రతిష్ఠ



కార్యక్రమానికి హాజరైన చందన నాగేశ్వర్ తదితరులు

కడియం: వీరవరంలోని వీవర్స్ కాలనీలో ఇటీవల పునర్నిర్మించిన లక్ష్మీగణపతి నందీశ్వరస్వామి ఆలయంలో శిలా విగ్రహ పునఃప్రతిష్ఠ, చౌడేశ్వరి అమ్మవారి దివ్యశిలా నూతన విగ్రహ ప్రతిష్ఠను సోమవారం అత్యంత వైభవంగా జరిపారు. దుళ్ల గ్రామానికి చెందిన కాళహస్తీశ్వర సిద్ధాంతి, బండారులంకకు చెందిన శైవగామ పండితుడు కారుపర్తి చెన్నమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా హోమాలు, శాంతి పూజలు, క్రతువులు నిర్వహించారు. అనంతరం భారీ అన్నసమారాధన జరిపారు. ఈ కార్యక్రమానికి ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ చందన నాగేశ్వర్, రాష్ట్ర టీడీపీ వైద్య విభాగం ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోరంట్ల రవిరామ్ కిరణ్ తదితరులు తరలివచ్చి, స్వామిఅమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారిని ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు.

శ్రీరాములు సేవలు చిరస్మరణీయం



శ్రీరాములు చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న ఏపీఎన్జీవో సంఘ అధ్యక్షుడు సుబ్బారావు నాయుడు

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఏపీ ఎన్జీవో సంఘ వ్యవస్థాపకుడిగా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, స్వర్గీయ ఆమనిగంటి శ్రీరాములు ఉద్యోగ లోకానికి చేసిన సేవలు చిరస్మరణీయమని నగర ఎన్జీవో సంఘ అధ్యక్షుడు సుబ్బారావు నాయుడు అన్నారు. శ్రీరాములు 104వ జయంతి సందర్భంగా నగర ఎంజీజీవో హోంలో సోమవారం సాయంత్రం సభ నిర్వహించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ ఎమ్మెల్యేగా, శాసన మండలి సభ్యుడిగా, ఆల్ ఇండియా స్టేట్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ చైర్మన్‌గా రాష్ట్రానికి, ఉద్యోగ లోకానికి శ్రీరాములు అందించిన సేవలు వెలకట్టలేనివన్నారు. కార్యక్రమంలో నగర ఎన్జీవో సంఘం కార్యదర్శి ప్రవీణ్ కుమార్, ఉపాధ్యక్షులు మాధవరావు, రాఘవరావు ఆనంద్, మహిళా ఎన్జీవో సంఘ నాయకులు రోజా రాణి, అర్చన, సుజాత తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి చదువుకు ఆర్థిక సాయం

ప్రకాశం నగర్: మున్సిపల్ కాలనీకి చెందిన ధూళిపూడి నాగ దేవాన్ష్ ఆర్థిక ఇబ్బందులతో పాఠశాల ఫీజు కట్టలేదు. ఈ విషయం రోటరీ క్లబ్ రివర్ సిటీ అధ్యక్షుడు నాలం నరసింహారావు దృష్టికి రాగా ఆ ఫీజు చెల్లించడానికి హెల్పింగ్ హ్యాండ్స్ వాట్సాప్ గ్రూపు సభ్యులు ముందుకు వచ్చారు. ఆ విద్యార్థికి ఫీజును స్కూలుకు వెళ్లి అందించారు. కార్యక్రమంలో స్వర్ణాంధ్ర సేవా సంస్థ నిర్వాహకుడు గుబ్బల రాంబాబు, జనసేన నాయకురాలు అలివేలు, హెల్పింగ్ హాండ్స్ అడ్మిన్ అనూప్ కుమార్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

రాజమహేంద్రవరం రూరల్: మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని ఏఎన్ఎం సుకుమారలత అన్నారు. హుకుంపేట డి బ్లాకులోని కమ్యూనిటీ హాలు వద్ద సోమవారం మ్యాజిక్ బస్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మ్యాజిక్ బస్ ఆధ్వర్యంలో టీఎంవో ప్రియాంక ఆటలు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. యూత్ మెంటర్ టి.మరియ, బి.భువనేశ్వరి, కె.నాగదేవి, మార్త తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి బైబిల్ మిషన్ మహాసభలు

- మార్గాని ఎస్టేట్‌లో పూర్తయిన ఏర్పాట్లు
- భక్తుల కోసం అన్ని వసతులు
- విలేకరులతో షారోన్ కుమార్



బైబిల్ మిషన్ సభల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న షారోన్ కుమార్ తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: స్థానిక మార్గాని ఎస్టేట్స్‌లో మంగళవారం నుంచి మూడు రోజుల పాటు బైబిల్ మిషన్ మహాసభలు నిర్వహిస్తున్నట్లు రెవరెండ్ డాక్టర్ ఏకే షారోన్ కుమార్ వెల్లడించారు. ఆ ప్రాంగణంలో సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ప్రతి రోజు ఉదయం 10.30 నుంచి, సాయంత్రం 6.30 గంటల నుంచి ఉపదేశాలు ఉంటాయని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. చలువ పందిళ్లతో పాటు అల్పాహారం, తాగునీరు, మధ్యాహ్నం, రాత్రి భోజన సదుపాయంతో పాటు, దూర ప్రాంతం నుంచి వచ్చేవారికి వసతి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ముఖ్య అతిథిగా మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్ విచ్చేస్తారని, బైబిల్ మిషన్‌కు చెందిన అధికారులు హాజరయ్యి ఉపదేశం ఇస్తారని తెలిపారు. లావేటి సుదర్శనరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు.

సేవా భావమే స్కౌట్స్ అండ్ గైడ్స్ ధ్యేయం



శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్

కడియం: దేశం, సమాజంపై సేవాభావం కలిగి ఉండడమే స్కౌట్స్, గైడ్స్ ప్రధాన ధ్యేయమని ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్ అన్నారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో పీఎంశ్రీ పాఠశాలల్లోని 160 మంది స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులకు కడియం ఉన్నత పాఠశాలలో సోమవారం నుంచి ఈ నెల 14వ తేదీ వరకు ఐదు రోజుల రెసిడెన్షియల్ పెట్రోల్ లీడర్స్ శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా ముందుగా జాతీయ, స్కౌట్ పతాకాలను ఆవిష్కరించారు. సర్వశిక్ష ఏఎంవో గౌరీ శంకర్ మాట్లాడుతూ స్కౌట్స్ అండ్ గైడ్ ట్రైనింగ్ విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. సీఐ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మిలిటరీ, పోలీసు అధికారులు కావడానికి స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణ ఉపయోగపడుతుందన్నారు. ప్రధానోపాధ్యాయుడు టి.సత్యనారాయణ ఈ క్యాంపు డైరెక్టర్‌గా వ్యవహరించనున్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ వెలుగుబంటి రఘురాం, సీఎంఓ శ్రీనివాస్, ఎంఈవో మణి కుమార్, స్కౌట్ టీచర్స్ రాజ్ కుమార్, గొల్లపల్లి సత్యనారాయణ, గిరిజ, కల్పన పాల్గొన్నారు.

తనిఖీకి ఆదేశం

ప్రకాశం నగర్: గౌతమి కో ఆపరేటివ్ సూపర్ బజార్ కార్యకలాపాలపై తనిఖీ చేయాలని తనకు ఆదేశాలు వచ్చినట్టు జిల్లా సహకార అధికారి వి.కృష్ణకాంత్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ప్రకటన విడుదల చేశారు. దీనిలో భాగంగా సూపర్ బజార్ రికార్డుల పరిశీలన, వాంగ్మూలాల నమోదు చేస్తామన్నారు. నెల రోజుల్లో తనిఖీలు పూర్తి చేయనునట్టు తెలిపారు.

జనార్దనస్వామి కల్యాణం

కడియం: గ్రామంలోని జనార్దన స్వామి ఆలయంలో సోమవారం రాత్రి స్వామివారి కల్యాణం ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన యువ నర్సరీ రైతు వెన్నపు మణికంఠస్వామి, దేవి దంపతులు పీటలపై కూర్చున్నారు. వేదపండితులు శాస్త్రోక్తంగా కార్యక్రమం జరిపించారు. ముందుగా రథోత్సవం కన్నుల పండువగా సాగింది.